# అగ్రనేత

TELTEL/2015/66279

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :198 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: మంగళవారం 14-10-2025 | పేజీలు:4 వెల: 2.00


## రైతుల అభివృద్ధికి ప్రతి ఏటా కేంద్రం రూ. 1,440 కోట్లు మంజూరు

మరికల్ : నారాయణపేట జిల్లాలో ధనధాన్య కృషి యోజన పథకం మంజూరు కావడం పట్ల మరికల్ మండల కేంద్రం తెలంగాణ చౌరస్తాలో బీజేపీ మండల అధ్యక్షుడు మంగలి వేణుగోపాల్ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ, ఎంపీ డీకే అరుణ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నారాయణపేట జిల్లా ప్రధాన కార్యదర్శి డోకూరు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో రైతుల శ్రేయస్సుకు ధనధాన్య కృషి యోజన పథకాన్ని అమలు చేయడంతో పాటు రైతుల అభివృద్ధికి ప్రతి ఏటా రూ. 1,440 కోట్లు నిధులు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఈ నిధులతో రైతులకు నాణ్యమైన విత్తనాలు, సామాగ్రిని అందజేస్తారని వివరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు భాస్కర్ రెడ్డి, వడ్డే శ్రీరామ్, వెంకటేష్, రమేష్, సురేందర్ గౌడ్, గొల్ల రాజేష్ యాదవ్, నరేష్ గౌడ్, మోహన్ రెడ్డి, వై డి గుప్తా, మాజీ సర్పంచ్ తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీటీసీ అంజనేయులు, అశోక్ కుమార్, మాజీ ఉపసర్పంచులు శివకుమార్, పాపిరెడ్డి, నాయకులు నరేష్ కుమార్ రెడ్డి, వెంకటేష్, సురేష్, ప్రతాప్ రెడ్డి, కురుమన్న, మల్లారెడ్డి, చెన్నయ్య, గూప నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్‌బీబీఎస్ స్టూడెంట్ అత్యాచారం కేసు.. సంచలన విషయాలు వెలుగులోకి..




బెంగాల్: పశ్చిమ బెంగాల్‌లో ఎమ్‌బీబీఎస్ విద్యార్థిని అత్యాచారానికి గురైన ఘటన ప్రస్తుతం రాష్ట్రంలో సంచలనం రేకెత్తిస్తోంది. ఈ కేసుపై స్పందిస్తూ సీఎం మమతాబెనర్జీ చేసిన వ్యాఖ్యలు మరింత వివాదాస్పదంగా మారాయి. ప్రైవేటు కాలేజీ విద్యార్థిని అర్ధరాత్రి వేళ క్యాంపస్ వదిలి ఎలా బయటకు రాగలిగారని ప్రశ్నించారు . విద్యార్థుల భద్రతా వ్యవహారాల బాధ్యత యాజమాన్యాలదే అని అన్నారు. అయితే, బాధితురాలిపై రాత్రి 8 గంటల సమయంలో అఘాయిత్యం జరిగినట్టు తాజాగా వెలుగులోకి వచ్చింది.తన కూతురు రాత్రి 8 గంటల సమయంలో బయటకు వెళ్లిందని బాధితురాలి తండ్రి ఫిర్యాదు చేసినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఆ సమయంలోనే ఈ దారుణం జరిగిందని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎఫ్‌ఐఆర్‌లో కూడా ఇదే విషయాన్ని నమోదు చేసినట్టు తెలిసింది ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రిపై ప్రతిపక్షాలు భగ్గుమన్నాయి. సీఎం అసత్యాలు పలుకుతున్నారని బీజేపీ ఎమ్మెల్యే అగ్నిమిత్ర పాల్ మండిపడ్డారు. 'అఫ్ఘానిస్థాన్ వలెనే పశ్చిమ బెంగాల్‌లో కూడా మమతా బెనర్జీ సారథ్యంలో తాలిబాన్ల తరహా పాలన సాగుతోంది. రాష్ట్రంలో అర్ధరాత్రి మహిళలు బయటకు వెళ్లరని ముఖ్యమంత్రి అంటున్నారు. అంటే..రాత్రి బయటకు వెళితే దారుణాలు జరుగుతాయని సీఎం చెప్పదలుచుకున్నారా?' అని ప్రశ్నించారు.సీపీఎం రాష్ట్ర సెక్రెటరీ మొహమ్మద్ సలీమ్ కూడా సీఎం స్టేట్‌మెంట్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో తాలిబాన్ల పాలన కొనసాగుతోందా అని ప్రశ్నించారు. 'ఆర్‌జీ కార్ కేసులో పోలీసులు విచారణను తప్పుదారి పట్టించారు. క్రిమినల్స్‌కు కొమ్ముకాశారు. అప్పుడు కూడా ఇలాగే మహిళలు అర్ధరాత్రి పని చేయకూడదని అన్నారు. రాజారామ్ మోహన్ రాయ, విద్యాసాగర్ వంటి సంఘ సంస్కర్తల ఉన్నతాశయాలకు ఇది విరుద్ధం. పురుషులు మహిళలు సమానమే. సీఎం ఎప్పుడూ మహిళలపైనే నెపం నెట్టే ప్రయత్నం చేస్తారు' అని అన్నారు.తన కామెంట్స్ వివాదాస్పదం కావడంతో సీఎం బెనర్జీ స్పందిస్తూ మీడియాపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తన వ్యాఖ్యలను మీడియా వక్రీకరించిందని అన్నారు. 'మీరు ఓ ప్రశ్న అడుగుతారు. నేను సమాధానం చెబుతాను. మీరు దాన్ని వక్రీకరిస్తారు. ఇలాంటి రాజకీయాలు చేయకండి' అని చెప్పారు.

# కాంగ్రెస్‌కు ఓటేస్తే.. హైడ్రా బుల్డోజర్ రావడం ఖాయం



హైదరాబాద్, అక్టోబర్ 13: బీఆర్ఎస్ జూబ్లీహిల్స్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ... జూబ్లీహిల్స్ బై ఎలక్షన్ కారుకు.. బుల్డోజర్‌కు మధ్య జరుగుతున్న ఎన్నిక అని అన్నారు. ఎన్నిక కాంగ్రెస్‌కు ఓటు వేస్తే హైడ్రా బుల్డోజర్ ఇంటికి రావటం ఖాయమంటూ వ్యాఖ్యలుచేశారు. మోసపోతే.. ప్రజలు ఘోస పడతారన్నారు. మాగంటి గోపినాథ్ కుటుంబం అనాథ కాదని.. వారికి అందరం అండగా ఉంటామని స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్‌లో ధర్మం బీఆర్ఎస్ వైపు ఉందన్నారు. తెలుగు భాషలో ఎన్ని తిట్లు ఉన్నాయో.. రేవంత్ రెడ్డిని ప్రజలు అన్ని తిట్లు తిడుతున్నారంటూ వ్యాఖ్యలు చేశారు. ఒక్కొక్కరికి కాంగ్రెస్ ఎంత బాకీ పడిందో గుర్తించి..ప్రతి వ్యక్తిని కలిసి బాకీ కార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌ను హైదారాబాదీలు నమ్మలేదని.. హైదరాబాద్ ఎన్నికల్లో అందుకే ఒక్క సీటు కూడా ఇవ్వలేదని తెలిపారు. ఇళ్ళు కూలగొట్టడమేనా ఇందిరమ్మ రాజ్యం అంటే అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి మాదిరి గలీజ్ భాష మాట్లాడే ముఖ్యమంత్రి దేశంలోలే లేరని మాజీ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలు చేశారు.

మాగంటి సునీత భావోద్వేగం...

కాగా.. బిబీఆర్ఎస్ జూబ్లీహిల్స్ కార్యకర్తల విస్త్రతస్థాయి సమావేశంలో ఆ పార్టీ అభ్యర్థి మాగంటి సునీత భావోద్వేగానికి గురయ్యారు. భర్త దివంగత మాజీ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్‌ను తలుచుకుని కన్నీటిపర్యంతమయ్యారు. గోపినాథ్ ఆశాయలా ముందుకు తీసుకెళ్తానని మాగంటి సునీత స్పష్టం చేశారు. అలాగే గోపీనాథ్ కుమార్తె అక్షర మాట్లాడుతూ.. 'మా తండ్రి గోపీనాథ్ ఆశయాలను ముందుకు తీసుకెళతాం. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటాం' అని అక్షర పేర్కొన్నారు.

# ఎన్నికల వేళ లాలూ కుటుంబానికి భారీ షాక్



పాట్నా:బిహార్ ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో ఆర్జేడీ పార్టీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్, ఇతర కుటుంబ సభ్యులకు గట్టి షాక్ తగిలింది. ఐఆర్‌సీటీసీ హోటల్ టెండర్స్ కేసులో లాలూతో పాటు ఆయన సతీమణి రబ్రీదేవి, కుమారుడు తేజస్వీ యాదవ్‌పై ఢిల్లీ కోర్టు అభియోగాలు దాఖలు చేసింది. మోసం, నేర పూరిత కుట్ర తదితర అభియోగాలను మోపింది .2004-09 మధ్య లాలూ ప్రసాద్ యాదవ్ రైల్వే మంత్రిగా ఉన్న సమయంలో ఈ స్కామ్ బయటపడింది. ఐఆర్‌సీటీసీ హోటల్స్‌ల నిర్వహణకు సంబంధించిన కాంట్రాక్ట్‌ల కేటాయింపులో అవినీతి జరిగిందన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. అప్పట్లో ఐఆర్‌సీటీసీకి చెందిన బీఎన్ఆర్ రాంచీ, బీఎన్ఆర్ పూరీ హోటల్స్ నిర్వహణ కాంట్రాక్ట్‌ను సుజాతా హోటల్‌కు ఇచ్చారు. అయితే, ఈ కాంట్రాక్ట్ కేటాయింపు తరువాత తాలూకు మూడు ఎకరాల విలువైన స్థలం ఓ బినామీ కంపెనీ ద్వారా లభించిందని సీబీఐ ఆరోపించింది. ఈ మేరకు 2017లో లాలూతో పాటు ఆయన కుటుంబసభ్యులపై ఎఫ్‌ఐఆర్ దాఖలు చేసింది.నిందితులపై అభియోగాలు దాఖలు చేసేందుకు తగిన ఆధారాలు ఉన్నాయని సీబీఐ తాజాగా కోర్టుకు తెలిపింది. అయితే, లాలూ తరపు న్యాయవాది మాత్రం ఈ వాదనలను తోసిపుచ్చారు. పారదర్శక రీతిలో కాంట్రాక్ట్‌ల కేటాయింపులు జరిగాయని అన్నారు.అయితే, కోర్టు మాత్రం సీబీఐ వాదనలతో ఏకీభవించింది. ఈ కేసులో కుట్ర కోణం ఉన్నట్టు ప్రాథమిక ఆధారాలను బట్టి అర్థమవుతోందని పేర్కొంది. భూమి పొందినందుకు ప్రతిగా అధికార దుర్వినియోగం, టెండర్ల ప్రక్రియను ప్రభావితం చేసే ప్రయత్నం జరిగినట్టు వెల్లడించింది.బిహార్‌లో వచ్చే నెల 6, 11 తేదీల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. దీంతో, అక్కడ ప్రచార పర్వం ఊపందుకుంది. ఆర్జేడీ నేతృత్వంలోని మహాగఠ్‌బంధన్ భారీ స్థాయిలో ప్రచారం నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో లాలూకు స్పీడుకు బ్రేకులేసేలా కోర్టు తీర్పు వెలువడటం ప్రాధాన్యత సంతరించుకుంది.

# నకిలీ మద్యం తయారీ కేసులో కీలక విషయాలు తెలిపిన జనార్ధన్‌రావు



హైదరాబాద్,ఆంధ్రప్రదేశ్‌ను కుదిపేస్తున్న ములకలచెరువు, ఇబ్రహీంపట్నం నకిలీ మద్యం కేసులో ప్రధాన సూత్రధారి జనార్దన్‌రావుకు విజయవాడ న్యాయస్థానం ఈ నెల 17వ తేదీ వరకు రిమాండ్ విధించింది.శనివారం ఉదయం ఎక్సైజ్ శాఖ అధికారులు అతడిని ఏడు గంటల పాటు సుదీర్ఘంగా విచారించి, కీలక వివరాలు రాబట్టారు. అనంతరం కోర్టులో ప్రవేశపెట్టగా, న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించారు. ఈ సందర్భంగా అధికారులు కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్టులో జనార్దన్‌రావు నేర సామ్రాజ్యానికి సంబంధించిన విస్తుపోయే నిజాలు, అతని కార్యకలాపాల వెనుక ఉన్న పక్కా ప్రణాళికలు వెలుగులోకి వచ్చాయి.రిమాండ్ రిపోర్టు ప్రకారం, జనార్దన్‌రావు 2012 నుంచి మద్యం వ్యాపారంలో ఉన్నాడు. ఇబ్రహీంపట్నంలో 'ఏఎన్ఆర్' పేరుతో బార్ నడుపుతూ మంచి లాభాలు ఆర్జించాడు.అయితే, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జాతీయ రహదారి పక్కనే ఉన్న బార్‌ను వేరే ప్రాంతానికి మార్చడంతో వ్యాపారం దెబ్బతింది. దీనికి తోడు కరోనా మహమ్మారి సృష్టించిన ఆర్థిక సంక్షోభంతో 2021 నాటికి తీవ్ర నష్టాల్లో కూరుకుపోయాడు. ఈ కష్టాల నుంచి గట్టెక్కేందుకు అడ్డదారిని ఎంచుకున్నాడు. నకిలీ మద్యం తయారీతో సులువుగా డబ్బు సంపాదించవచ్చని భావించి, ఆ దిశగా ప్రణాళికలు రచించాడు.మొదట హైదరాబాద్‌లోని నిజాంపేటలో ఒక గదిని అద్దెకు తీసుకుని తన కార్యకలాపాలు ప్రారంభించాడు.అధికారులకు అనుమానం రాకుండా ఉండేందుకు ఓ సరికొత్త ఎత్తుగడ వేశాడు. 35 లీటర్ల ప్లాస్టిక్ డబ్బాల్లో మద్యాన్ని నింపి, వాటిపై 'ఫినాయిల్' అని స్టిక్కర్లు అంటించి నకిలీ ఇన్‌వాయిస్‌లతో ఇబ్రహీంపట్నంకు తరలించేవాడు. అక్కడ ఈ కేసులో ఐదో నిందితుడైన హాజీ వాటిని అందుకుని, లీటర్ బాటిళ్లలో నింపి విక్రయించేవాడు. ఇలా కొన్నాళ్లపాటు తన అక్రమ వ్యాపారాన్ని గుట్టుచప్పుడు కాకుండా నడిపించాడు. 2023లో గోవాకు వెళ్లిన జనార్దన్‌రావుకు, అక్కడే స్థిరపడిన తెలుగు వ్యక్తి, ఈ కేసులో మూడో నిందితుడైన బాలాజీతో పరిచయం ఏర్పడింది. ఆంధ్రప్రదేశ్‌లో మద్యం ధరలు అధికంగా ఉన్నాయని, గోవా నుంచి ఖరీదైన బ్రాండ్లను తక్కువ ధరకు తెచ్చి అమ్మితే భారీ లాభాలు వస్తాయని బాలాజీ ఆశ చూపాడు. దీంతో వీరిద్దరూ కలిసి నకిలీ మద్యం తయారీని మరింత విస్తృతం చేయాలని నిర్ణయించుకున్నారు. డిస్టిలరీలతో పరిచయాలున్న బాలాజీ ముడిసరుకు (స్పిరిట్) సరఫరా చేసేవాడు. హైదరాబాద్‌కు చెందిన మరో నిందితుడు రవి (ఏ4) నకిలీ లేబుల్స్, ప్రసాద్ అనే వ్యక్తి బాటిల్ మూతలను సమకూర్చేవారు.ముడిసరుకును బెంగళూరు, ముంబయి, దిల్లీ వంటి నగరాల నుంచి ఐషర్ వ్యాన్‌లలో తరలించేవారని రిపోర్టులో పేర్కొన్నారు.2023 నుంచి ఇబ్రహీంపట్నంలోని తన ఏఎన్ఆర్ బార్‌లోనే కల్తీ మద్యం తయారీని ప్రారంభించాడు. మంజీరా విస్కీ, కేరళ మాల్ట్, ఓల్డ్ అడ్మిరల్, క్లాసిక్ బ్లూ వంటి ప్రముఖ బ్రాండ్ల పేర్లతో నకిలీ మద్యాన్ని సృష్టించి, మొదట తమ బార్‌లోనే అమ్మేవారు. ఈ దందాలో ఒక్కో క్వార్టర్ బాటిల్‌పై రూ.35 నుంచి రూ.40 వరకు లాభం పొందినట్లు తేలింది. 2024 ఎన్నికల సమయంలో నిఘా పెరగడంతో కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేశారు.ఇదే సమయంలో తంబళ్లపల్లి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన జయచంద్రారెడ్డితో జనార్దన్‌రావుకు స్నేహం ఉందని, ఆయన అనుచరులైన సురేంద్ర నాయుడు, పీఏ రాజేష్‌లు వైన్ షాపులు దక్కించుకున్నారని కూడా రిపోర్టులో ప్రస్తావించారు. అయితే మద్యం వ్యాపారంలో అనుభవం లేకపోవడంతో వీళ్లిద్దరూ నష్టపోయారు. 2025 మే నెల నుంచి ములకలచెరువు, ఇబ్రహీంపట్నంలలో ఏకకాలంలో మళ్లీ తయారీని మొదలుపెట్టాడు. అయితే, గత నెల 25న జయచంద్రారెడ్డి దక్షిణాఫ్రికాలో ఉన్నాడని తెలిసి జనార్దన్‌రావు కూడా అక్కడికి వెళ్లాడు. రువాండాలో ఉన్న సమయంలోనే ములకలచెరువు అడ్డాపై ఎక్సైజ్ అధికారులు దాడి చేసి గుట్టురట్టు చేశారు. ఈ కేసులో ఇప్పటివరకు 10 మందిని అరెస్టు చేసినట్లు, జనార్దన్‌రావు విచారణలో మరిన్ని కీలక విషయాలు బయటపడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

# హైదరాబాద్‌లో సేఫ్ రైడ్ ఛాలెంజ్ ప్రారంభం



హైదరాబాద్ కొత్త పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన వీసీ సజ్జనార్‌పోలీసింగ్‌లో తన ప్రత్యేక మార్క్‌ను చూపిస్తున్నారు. జనాల్లో భద్రతా డ్రైవింగ్ అలవాట్లను పెంపొందించడానికి సజ్జనార్ సేఫ్‌రైడ్ అనే ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా వాహనదారులు ప్రయాణం ప్రారంభించేముందు హెల్మెట్‌ధరించడం, సీట్‌బెల్ట్ కట్టుకోవడం వంటి భద్రతా చర్యలను పాటించాల్సిన అవసరం గుర్తు చేసుకోవాలి. వాహనదారులు ఈ భద్రతా చర్యలను పాటిస్తూ చిన్న వీడియో లేదా ఫోటో తీసి, తమ మిత్రులు లేదా కుటుంబ సభ్యులను ట్యాగ్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయాలని సలహా ఇవ్వబడింది. సజ్జనార్ పేర్కొన్నారు, "సేఫ్టీ ఎప్పుడూ ఫ్యాషన్ అవుట్ కాదు. ప్రతి ప్రయాణం మీకోసం మాత్రమే కాక, మీ కుటుంబం, స్నేహితులను కూడా రక్షించే నిర్ణయం తీసుకునే క్షణం."

యువతలో మార్పు, సోషల్ మీడియాలో ప్రచారం

సజ్జనార్ పేర్కొన్నట్టు, ఈ చలనవిధానం సోషల్ మీడియా వాడే యువతలో మార్పు తీసుకురావడమే లక్ష్యం. ఇది రోడ్డు ప్రమాదాల పట్ల అవగాహన కల్పించి భద్రతా చింతనను పెంపొందించగలదు. అంతేకాక, వీసీ సజ్జనార్ కోరుతూ, "వాహన నడిపే ప్రతి పౌరుడు ఈ కార్యక్రమంలో పాల్గొని 2025లో సేఫ్టీని కూలెస్ట్ ట్రెండ్‌గా మార్చుదాం" అని అన్నారు.

SafeRideChallenge అంటే ఏమిటి?

SafeRideChallenge ఒక భద్రతా డ్రైవింగ్ ప్రోత్సాహక కార్యక్రమం, ఇందులో హెల్మెట్, సీట్‌బెల్ట్ వంటి భద్రతా చర్యలను పాటించి వీడియో/ఫోటో ద్వారా సోషల్ మీడియాలో భాగస్వామ్యం చేయాలి

# రైతులందరికీ అన్ని రకాల వడ్లకు బోనస్ ప్రకటించాలి



సిద్ధిపేట జిల్లా : రైతులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం అన్ని రకాల వడ్లకు బోనస్ ప్రకటించాలి. 2023 ఎన్నికల సందర్భం లో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా అన్ని రకాల వడ్లకు రూ.500/- రూపాయల బోనస్ చెల్లించాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారుసిద్ధిపేట జిల్లా కొమురవెల్లి మండలం కొమురవెల్లి, అయినాపూర్, కిష్టంపేట, గ్రామాలలో వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. తాను గ్రామాల్లో పర్యటిస్తున్న క్రమంలో రైతులు తనను కలిసి కేవలం సన్న వడ్లకు మాత్రమే బోనస్ అందిస్తున్నారని రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారుగత ప్రభుత్వ హయాంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే అధికారులతో సమీక్షించి ఆనాడే దాదాపు 7500 వడ్ల కొనుగోలు కేంద్రాలను నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభం చేశారని అన్నారు. ఈ రోజు కూడా 7500 కేంద్రాలు కొనసాగుతున్నాయన్నారు.

అన్ని రకాల వడ్లకు బోనస్ ప్రకటించాలి..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే 500 రూపాయలు వడ్లకు బోనస్ ఇస్తామని చెప్పారు. దొడ్డువడ్లకు కూడా ఇస్తామని చెప్పారు కానీ దురదృష్టవశాత్తు ఎన్నికలు అయిపోయాక అధికారంలోకి వచ్చాక కేవలం సన్నవడ్లకు మాత్రమే బోనస్ ఇస్తున్నారన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం హామీలు నెరవేర్చే బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అధికారంలోకి వచ్చాక మేనిఫెస్టోలో పెట్టిన విధంగా హామీలపై ప్రమాణం చేసిన ప్రకారం హామీలు అన్ని నెరవేర్చాలని అన్నారు. గతంలో సన్న వడ్లకు ప్రకటించిన బోనస్ కూడా బకాయిలు ఉన్నట్లు తెలిసిందని.. అవి కూడా వెంటనే మంజూరు చేయాలని కోరారు. రైతులందరికీ అన్ని రకాల వడ్లకు 500 రూపాయల బోనస్ ప్రకటించాలని అన్నారు2015 తర్వాత మన రాష్ట్రంలో ఆనాడు 14వ స్థానంలో ఉండే సాగు విస్తీర్ణాన్ని రెండవ స్థానానికి కేసీఆర్ గారు తీసుకురాగలిగారు ఉత్పాత కథ 15వ స్థానంలో ఉంటే అది కూడా రెండవ స్థానానికి తీసుకురావడం జరిగిందని తెలిపారు ఈ రెండు కలిపి ఉత్పత్తి చూసినట్టయితే భారత దేశంలోనే తెలంగాణ వరి ఉత్పత్తిలో నెంబర్ వన్ స్థానంలో ఉందన్నారు. దీనికి కారణం గత బీఆర్ఎస్ ప్రభుత్వమే కేసీఆరే అని తెలిపారు. అదే విధంగా ఇప్పుడు కూడా కొనసాగాల్సిన అవసరం ఉన్నదని సూచించారు.

ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లే నీరు వృధాగా..

తపాస్‌పల్లి రిజర్వాయర్‌లోకి నీరు ఆలస్యంగా వస్తుందని.. వచ్చిన నీరు కూడా వృధాగా వెళ్లిపోతున్నాయని యాజమాన్య పద్ధతులలో అధికారులు వైఫల్యం చెందుతున్నారని విమర్శించారు. లెఫ్ట్ కెనాల్, రైట్ కెనాల్ ద్వారా నీటిని వృధాగా లీకేజీ ద్వారా పోనిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.. కాబట్టే నీరు వృధాగా పోతుందని అవసరం ఉన్నప్పుడు నీరు దొరకదని అన్నారు.ప్రధానంగా రెండు డిమాండ్లు చేస్తున్నానని.. రైతులకు సన్నవడ్లతోపాటు దొడ్డువడ్లకు కూడా 500 రూపాయల బోనస్ చెల్లించాలని తపాస్‌పల్లి రిజర్వాయర్‌లో నీటిని స్టోరేజ్ చేసి యాసంగి పంటకు రైతులకు నీరు అందించే విధంగా చూడాలని కోరారు. రైతులకు డబ్బులు వచ్చాక రైస్ మిల్లులకు వెంటనే కనెక్ట్ చేయాలన్నారు. ఐపీ కావచ్చు పీఏసీఎస్ కావచ్చు.. అది కనెక్ట్ చేసి ఎలాంటి దోపిడీ లేకుండా రైస్ మిల్లర్లు ఇష్టం వచ్చినట్లు వ్యవహరించకుండా ఇక్కడ ఉండే అధికారులు దానిపై నిఘా పెట్టాలని ఆయన అధికారులను కోరారు.

# బాకీలు వసూలు చేసేంత వరకు పోరాటం ఆగదు



సూర్యాపేట, అక్టోబర్ 13 : ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో అధికారంలో వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల ప్రజలను నిలువున దగా చేసిందని మాజీ రాజ్యసభ సభ్యుడు, బీఆర్ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్య యాదవ్ అన్నారు. కాంగ్రెస్ బాకీ కార్డులను సోమవారం సూర్యాపేట పట్టణంలోని 46వ వార్డులో బీఆర్ఎస్ నాయకులు ఆంగోతు బావ్ సింగ్ ఆధ్వర్యంలో ఇంటింటికి పంపిణీ చేసి మాట్లాడారు. 22 నెలలు కాంగ్రెస్ పాలనలో ఏ ఒక్క రంగంలో ప్రజలు బాగుపడలేదన్నారు. నాడు ముఖ్యమంత్రిగా కేసీఆర్ ప్రజా రంజక పాలనను అందిస్తే నేడు రైతులు, రైతు కూలీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను హామీల పేరుతో కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయించాల్సిన బాధ్యత ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ పార్టీ తీసుకున్నదని అందులో భాగంగా ప్రజలకు బాకీ పడ్డ నగదు వివరాలను తెలుపుతూ కాంగ్రెస్ బాకీ కార్డులను ఇంటింటికి పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.రైతులకు రుణమాఫీ, మహిళలకు నెలకు రూ.2,500, విద్యార్థినిలకు స్కూటీలు, వికలాంగులు, వృద్ధులకు పెన్షన్ల పెంచుతామని పెంచకుండా బాకీ పడ్డారన్నారు. దగాకోరు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు ప్రశ్నించాలని, కాంగ్రెస్ బాకీలు అమలు చేసే వరకు బీఆర్ఎస్ ప్రజల వెంట ఉంటుందని, హామీల అమలుకు పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పుట్ట కిశోర్, మాజీ జడ్పీటీసీ జిడి భిక్షం, బీఆర్ఎస్ నాయకులు బండారు రాజా, ఆంగోతు బావ్ సింగ్, మద్దూరి సుధాకర్, చిట్టిపాక రాములు, మేడే సాగర్, దాసోజు దేవేంద్రాచారి, కృష్ణారెడ్డి, రజిని, అనూష, ఉపేంద్ర పాల్గొన్నారు.

## సంపాదకీయం

మంగళవారం 14-10-2025

# నోబెల్ మనకెందుకు రావట్లేదు?

ఏటా అక్టోబర్ నెల రాగానే విజ్ఞానం, సాహిత్యం, శాంతి, ఆర్థిక శాస్త్రాల్లో మేటి పరిశోధనలకు అత్యున్నత గౌరవమిచ్చే నోబెల్ బహుమతుల ప్రకటన వెలువడుతుంది. 1901 నుంచి ప్రదానం చేస్తున్న ఈ పురస్కారాల గ్రహీతలెవరో తెలుసుకోవడానికి ప్రపంచమంతా అమితాసక్తితో ఎదురు చూస్తుంటుంది. మానవాళికి మేలుచేసే నవ్యావిష్కరణలే కాదు- జిజ్ఞాసతో వినూత్నంగా చేసిన పరిశోధనలూ పనులూ రచనలూ నోబెల్ ఫౌండేషన్ సగౌరవంగా హత్తుకుంటోంది. మరి ఈ పురస్కారాల సాధనలో మనమెందుకు వెనకబడ్డాం?

ప్రతి ఒక్కరూ శాస్త్రీయ దృక్పథాన్నీ ప్రశ్నించే మనస్తత్వాన్నీ మానవత్వాన్నీ పరిశోధన-సంస్కరణ భావనని పెంపొందించుకోవాలని భారత రాజ్యాంగం ప్రబోధిస్తోంది. జనావళిలో మూఢనమ్మకాలు, అన్వేషణ రహిత ఆలోచనలు కాకుండా- తార్కికత, విశాల మనసు, హేతుబద్ధమైన ఆలోచనను వృద్ధి చేయాలన్నదే ఆర్టికల్ 51(ఏ)(హెచ్) ఉద్దేశం. శాస్త్రీయ వికాసం తాలూకా పరమావధి మానవాళి సంక్షేమమే కావాలని ఇది గుర్తుచేస్తుంది. కానీ దాన్ని పాటిస్తున్న వారెందరు ఉంటారు? జన భారతంలో ఎందరో శాస్త్రవేత్తలు, ఆర్థికవేత్తలు, సృజనాత్మక రచయితలు ఉన్నప్పటికీ, ఇప్పటివరకు వరించిన నోబెల్ బహుమతులు కేవలం తొమ్మిదంటే తొమ్మిదే! అమెరికా 400కు పైగా, యూకే, జర్మనీ, ఫ్రాన్స్‌లు ఒక్కొక్కటి వందకుపైగా నోబెల్ బహుమతులు పొందాయి. స్వీడన్ వంటి బుల్లి దేశం సైతం 35 మంది నోబెల్ విజేతలను ప్రపంచానికి అందించింది. అంటే, ఒక రకంగా నోబెల్ బహుమతుల సంఖ్య కూడా అభివృద్ధికి సూచిక అన్నమాట. భారత్ 2047 నాటికి వికసిత దేశంగా అవతరించాలంటే, ఈ సూచికనూ దృష్టిలో పెట్టుకోవాలి. నోబెల్ సాధనలో దేశం ఎందుకు వెనకబడిందని ఆలోచిస్తే- మన పిల్లలు, విద్యార్థుల్లో జిజ్ఞాస(క్యూరియాసిటీ), సృజనాత్మకతలకు సరిగ్గా సానపెట్టడం లేదని అవగతమవుతుంది.

'ఎందుకు?' అని అడుగుతున్నామా?

స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ తయారుచేసే ప్రపంచంలోని అత్యున్నత రెండు శాతం శాస్త్రవేత్తల జాబితాలో భారతీయ పరిశోధకుల సంఖ్య అంతకంతకు పెరుగుతోంది. 2024లో మన దేశం నుంచి 5,300 మందికి అందులో చోటుదక్కడం ఎంతో గర్వించదగ్గ విషయం. ఇంత పెద్దసంఖ్యలో శాస్త్రవేత్తలు ఉన్నప్పటికీ, శాస్త్ర పరిశోధనల్లో నోబెల్ స్థాయి బహుమతులు మాత్రం ఈ మధ్యకాలంలో ఇండియాకు దక్కలేదు. స్టాన్‌ఫోర్డ్ జాబితాలో అంతమంది భారతీయులు ఉన్నారంటే పరిశోధనలకు ప్రోత్సాహం లభిస్తుందనే చెప్పాలి. అయితే, నిజమైన వైజ్ఞానిక ప్రతిభను పరిశోధనా పత్రాల సంఖ్యనుబట్టి కాకుండా... సృజనాత్మకత, నవ్యాలోచన, సమాజానికి చేసే మేలు వంటి కొలమానాల ఆధారంగా లెక్కించాలి. ఉదాహరణకు కొవిడ్-19 వ్యాక్సిన్ అభివృద్ధికి చేపట్టిన ఎంఆర్ఎన్ఏ పరిశోధన, కృత్రిమ మేధపై తొలిదశలో జరిగిన ప్రాథమిక పరిశోధనల వంటివి ఎంతో జిజ్ఞాసతో చేపట్టినవి. వీటిని చేపట్టిన శాస్త్రవేత్తలు 'ఎందుకు?' అనే ప్రశ్నకు సమాధానం వెతుకుతూ ముందుకు సాగారేకానీ బహుమతులు పొందాలని మాత్రం కాదు.పిల్లలు సహజంగానే తరచూ 'ఎందుకు?' అని అడుగుతుంటారు. వారిలోని ఆ ఆసక్తిని పెంచి పోషిస్తేనే కొత్త ఆవిష్కరణలు ఉద్భవిస్తాయి, సృజనాత్మకత వృద్ధి చెందుతుంది. కానీ మన విద్యావిధానం ఆ జిజ్ఞాసను బలహీనపరుస్తోంది. 'ప్రశ్నించడం' తక్కువ విలువైన వ్యవహారంగా మారింది. 'ఎందుకు?' అని అడగడం పెద్ద ఆటంకమని భావించడం, భిన్న ఆలోచనలను, అభిప్రాయాలను అణచివేయడం అలవాటైపోయింది. ఎలాంటి ప్రశ్నలూ వేయకుండా విషయాలను ఉన్నది ఉన్నట్లుగా అంగీకరించడమే మంచి లక్షణమన్నట్లు పిల్లలకు నూరిపోస్తున్నాం. పైగా పరిశోధనల్లో ఒరిజినాలిటీ తగ్గింది. ఎక్కువ పరిశోధనా పత్రాలు ప్రచురించడం, ఎక్కువ సైటేషన్లు పొందడం, ఎక్కువ పేటెంట్లు సాధించడమే ప్రాధాన్యంగా చూస్తున్నారు. కొత్త ఆలోచనలకు తగిన గుర్తింపు లభించడం లేదు. తద్వారా ఎంతసేపూ నిపుణులను తయారు చేస్తున్నాం తప్పితే, ప్రపంచస్థాయిలో వినూత్న ఆవిష్కరణలు చేసేవారిని మాత్రం పెద్దగా అందివ్వలేకపోతున్నాం.

ప్రపంచ యవనికపై తళుకులీనాలంటే...

భారతదేశానికి నోబెల్ బహుమతులు తక్కువగా రావడానికి ప్రధాన కారణం- నిధులు, సౌకర్యాల లేమి కాదు. జిజ్ఞాసను పెంపొందించకపోవడమే అసలైన కారణం. అది లోతైన సాంస్కృతిక సమస్యని గుర్తించాలి. దేశవ్యాప్తంగా విద్యాసంస్థలు, మౌలిక వసతులు ఎన్ని పెరిగినా- అవేవీ 'ఎందుకు?' అని ప్రశ్నించే ధైర్యం ఇవ్వడం లేదు. జిజ్ఞాస విలాసమేమీ కాదు, ఆవిష్కరణలకు అవే గట్టి పునాది! భారతదేశం నూతన ఆవిష్కరణలతో ప్రపంచ వేదికపై తళుకులీనాలంటే- దేశంలోని ప్రతి ఒక్కరి జిజ్ఞాసనూ చిన్నప్పటి నుంచీ ప్రతి దశలోనూ పరిరక్షించి, ప్రోత్సహించి, గౌరవించాలి. అప్పుడే మనం పరిశోధనా పత్రాలు, పేటెంట్ల సంఖ్యను లెక్కించడం నుంచి... నిజమైన ఆవిష్కరణలతో సంబరాలు చేసుకునే దిశగా ప్రయాణిస్తాం. అంతవరకూ అరకొరగానే నోబెల్ బహుమతి లేదా దాంతో సమానమైన గుర్తింపు తెచ్చుకోవడంతోనే సంతృప్తి చెందాలి.

అంతా 'జిజ్ఞాస'తోనే...

ప్రతి ఒక్కరిలో తెలుసుకోవాలనే జిజ్ఞాస ఉంటుంది. అది ఎంత ఎక్కువగా ఉంటే, అంత నాణ్యమైన ప్రశ్నలు అడుగుతుంటారు. కొత్తగా ఆలోచిస్తారు. నోబెల్ బహుమతులు పొందిన చాలా ఆవిష్కరణల వెనక ఉన్నవి భిన్నమైన, అనూహ్యమైన ఆలోచనలే. జిజ్ఞాస సృజనాత్మకతనూ ధైర్యాన్నీ పెంచుతుంది. జీవితాంతం నేర్చుకునే శక్తిని ఇస్తుంది. విజ్ఞానం నుంచి సాహిత్యం వరకు, కళల నుంచి సాంకేతికత వరకు- మానవ వికాసమంతా జిజ్ఞాస ఆధారంగానే జరిగింది. భారత్ ప్రపంచస్థాయిలో పోటీ పడాలంటే... బాలలు, విద్యార్థుల్లోని ఆసక్తిని అణచకూడదుబీ తప్పనిసరిగా ప్రోత్సహించాలి. అందుకు విద్యా సంస్కరణలు అవసరం. బట్టీ పట్టించే పద్ధతిని విడనాడి, ప్రశ్నల ఆధారంగా నేర్పించే విధానాలు తీసుకురావాలి. పరిశోధనలో కొత్తదనాన్ని ప్రోత్సహించాలి. సృజనాత్మక ఆలోచనలకు అవసరమైన నిధులు, సరైన గుర్తింపు ఇవ్వాలి. రిస్క్ తీసుకుని చేపట్టే పరిశోధనలకు దన్నుగా నిలబడాలి. ఫలితాలు వెంటనే రాకపోయినా, మౌలిక పరిశోధనలపై పెట్టుబడులు పెట్టాలి. ప్రపంచ గతిని మార్చే నాణ్యమైన ఆలోచనల ద్వారా- అంతర్జాతీయ స్థాయిలో దేశ భాగస్వామ్యం ఇనుమడించాలి.

# సినీ సెలెబ్రిటీలను,రాజకీయ నాయకులను షేక్ చేస్తున్న ఏఐ!



హైదరాబాద్,ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రపంచాన్ని శాసిస్తోంది. దీంతో ఎన్ని లాభాలు ఉన్నాయో అంతకన్నా ఎక్కువ నష్టాలు ఉన్నాయనే వాదనలు మొదటి నుంచీ ఉన్నవే. కాకపోతే.. ఇప్పుడు ఆ నష్టాలు కళ్లెదుటే సాక్షాత్కరిస్తున్నాయి. నిన్నటి వరకు దీన్ని తయారు చేసిన నిపుణులు చెబితే అంతగా పట్టించుకోలేదు. కానీ ఇప్పుడు ఏఐ వల్ల కలిగే దుష్పరిణామలు ప్రత్యక్షంగా చూసి పలువురు సెలెబ్రిటీలు, రాజకీయ నాయకులు బిక్కచచ్చిపోతున్నారు. ఈ సాంకేతికతతో తయారు చేసిన వీడియోలు, ఫొటోలను కనిపెట్టడం అంత సులువు కాదు. అంత నాచురల్‌గా, అచ్చం మనుషుల మాదిరే కన్పిస్తారు. మన కళ్లు, మన చెవులే మనల్ని మోసం చేసేలా ఈ వీడియోలు ఉంటున్నాయి. ఏది నిజమో ఏది కల్పనో తెలియక సాధారణ జనం తికమకపడుతున్నారు. ఏఐ పేరు అని చెబితే చాలు రాజకీయ నాయకులు, సెలెబ్రిటీలు హడలిపోతున్నారు. ఏ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ చూసినా ఈ వీడియోలే కుప్పలు తెప్పలుగా దర్శనమిస్తున్నాయి. దీని సాయంతో లేనిది ఉన్నట్లు, ఉన్నది లేనట్లుగా వీడియోలను, చిత్రాలను తయారు చేసి జనాల మీదికి లక్షల సంఖ్యలో వదులుతున్నారు. దీంతో అనేక మంది కృత్రిమ మేధను తలుచుకుని నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. ప్రస్తుతం బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, ఆర్జేడీ, కాంగ్రెస్ పార్టీలు పోటాపోటీగా వీడియోలు తయారు చేస్తున్నాయి. ఇందులో అసలు ఏంటీ, నకిలీ ఏంటనేది తెలుసుకో లేని విధంగా ఉన్నాయి.

తాజాగా సోనియా, రాహుల్ టార్గెట్

కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్, తన తల్లి సోనియా గాంధీతో కలిసి బార్‌కు వెళ్లినట్లు, అక్కడ వీరిద్దరు మద్యం తాగుతుంటే.. బార్ గర్ల్ నాట్యం చేస్తున్నట్లు ఉన్న వీడియోను బీజేపీ శ్రేణులు రూపొందించాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతకు ముందు ప్రధాని నరేంద్ర మోదీ, అతని తల్లి హీరాబెన్‌తో ఒక వీడియోను కాంగ్రెస్ తయారు చేసి తన అధికారిక ఖాతాలో రిలీజ్ చేసింది. ప్రధాని మోదీతో ఉన్న ఫొటోను జతపరిచి 'ఈ రోజు ఓటు చోరీ విజయవంతంగా కంప్లీట్ చేశాము, ఇప్పుడు హాయిగా నిద్రపోదాం' అంటూ కన్పిస్తుంది. మోదీ కలలోకి ఆయన తల్లి వస్తుంది. ఓట్ల కోసం రాజకీయాల్లో ఎంత దిగజారడానికైనా సిద్ధంగా ఉన్నావా? పెద్ద నోట్ల రద్దుతో జనాలను క్యూ లైన్లలో నిల్చోబెట్టావు.. అంటూ తిట్లు అందుకుంటుంది. ఆ వెంటనే మోదీకి మెలకువ వస్తుంది. దీనిపై బీజేపీ కౌంటర్ అటాక్ ఇస్తూ, ప్రధాని తల్లిని కించపరిచారని ఆరోపించింది.

మోదీ, మెలోనీకీ తప్పలేదు

కొంతకాలం క్రితం ప్రధాని నరేంద్ర మోదీ, ఇటలీ ప్రధాని జార్జియా మెలోని ఇద్దరూ ఒక కార్యక్రమంలో కలుసుకుని షేక్ హ్యాండ్ ఇచ్చుకున్నారు. ఒక ఇన్ ఫ్లుయన్సర్ ఈ ఫొటోలతో ఒక వీడియో తయారు చేసి షేర్ చేశారు. ఇద్దరు కలిసి ముద్దులు పెట్టుకుంటున్నట్లు, బుల్లెట్‌ను ఆమె నడుపుతున్నట్లు చేసిన వీడియో సోషల్ మీడియాలో ప్రకంపనలు సృష్టించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు పుతిన్ కాళ్లు పట్టుకుంటున్నట్లు తయారు చేశారు. ఇద్దరు కలిసి డ్యాన్స్ చేస్తున్నట్లు కూడా చూపించారు. ఆ మధ్యన హీరోయిన్ రష్మిక మందన్న డీప్ ఫేక్ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఇండియన్ ఇన్ ఫ్లుయన్సర్ జరా పటేల్ వీడియోకు రష్మిక ముఖాన్ని జతచేసి సోషల్ మీడియాలోకి వదిలారు. ఇంకేముంది ఇది వైరల్ అయ్యింది. డీప్ ఫేక్‌తో పలువురు ప్రముఖలను ఇబ్బందులకు గురి చేశారు. ఇలా నచ్చిన వారిపై హాయి గొలిపే విధంగా, నచ్చని వారిపై జుగుప్సాకరంగా, అశ్లీల వీడియోలను తయారు చేస్తున్నారు. ఈ వీడియోలను చూసిన సెలెబ్రిటీలు తలలు పట్టుకుంటున్నారు. నిన్న మొన్నటి వరకు ఫొటోలు, వీడియోలు మాత్రమే షేర్ చేయగా ఆనందించారు. ఇప్పుడేమో ఏఐ ఫొటోలు, వీడియోలు వీరిని నిద్రలేని రాత్రులకు గురిచేస్తున్నది. బాలీవుడ్ నుంచి లోకల్ వుడ్ వరకు హీరోలు, హీరోయిన్లు ఆటో నడుపుతున్నట్లు, బట్టలు ఉతుకుతున్నట్లు, తుపాకీతో కాల్చుతున్నట్లు ఇలా ఒకటేమిటీ ఎన్నింటినో తయారు చేసి షేర్ చేస్తున్నారు. 'ఆ వీడియోలు, చిత్రాలు పోస్ట్ చేయడం సభ్యత కాదని వాటి ప్రస్తావనలు మాత్రమే చేస్తున్నాం).

ఏఐతో కోర్టులకు సెలెబ్రిటీల పరుగులు

తమ అనుమతి లేకుండానే తమ ఫొటోలు, వీడియోలు వినియోగిస్తూ వ్యక్తిగత భద్రతకు భంగం కలిగిస్తున్నారంటూ బాలీవుడ్ జంట ఐశ్వర్య రాయ్, అభిషేక్ బచ్చన్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఏఐ సాయంతో అశ్లీల కంటెంట్ తయారు చేసి సోషల్ మీడియాలో అప్ లోడ్ చేస్తున్నారని, బాలీవుడ్ ఇష్క్ అనే చానల్ లో 259 వీడియోలు ఉన్నట్లు వారు తెలిపారు. వ్యక్తిగత భద్రతకు భంగం కలిగించేలా ఉన్న వాటిని తొలగించేలా ఆదేశాలు ఇస్తామని హైకోర్టు వెల్లడించింది. తమ ఫొటోలను వాడుకుంటూ వాటితో మార్ఫింగ్ వీడియోలు, ఫొటోలు తయారు చేసి కొందరు సైబర్ నేరగాళ్లు సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారంటూ పలువురు సెలబ్రిటీలు ఆందోళనకు గురవుతున్నారు. ఆన్‌లైన్‌లో కుప్పలు తెప్పలుగా తమ స్టేటస్‌ను, పరువును ఆసాంతం గంగలో కలిపేలా వస్తున్న వీడియోలు, ఫొటోలను నియంత్రించాలంటూ ఒక్కొక్కరుగా కోర్టు మెట్లు ఎక్కుతున్నారు. ఏఐ ద్వారా మార్ఫింగ్ చేసి తన ప్రతిష్టను దిగజార్చుతున్నారని, వ్యక్తిత్వాన్ని దెబ్బతీస్తున్నారంటూ హీరో నాగార్జున ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ సందర్భంగా జడ్జి 'ఏఐ వచ్చిన తరువాత భూతంలా తయారైంది' అని వ్యాఖ్యానించారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఏఐ సాంకేతికతతో బాలీవుడ్ కు చెందిన ఒక నటుడి ఫొటోలను నగ్నంగా చూపిస్తూ ఆయన బంధువులు, స్నేహితులు, నిర్మాతలు, కుటుంబ సభ్యులకు షేర్ చేశారు. ఆయన సోషల్ మీడియా ఖాతాలను హ్యాక్ చేసి, ఆయన ఫొటోలను మార్ఫింగ్ చేసి పంపించారు. ఈ ఘటన హైదరాబాద్ నగరంలో చోటు చేసుకోగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఇదే కాకుండా సెలెబ్రిటీలు స్వయంగా ప్రమోట్ చేస్తున్నట్లుగా గ్యాంబ్లింగ్ యాడ్ లతో సోషల్ మీడియాలో వైరల్ అవుతూ తలనొప్పిగా మారాయి. సినిమాలలో విలన్ లను క్లైమాక్స్ లో తుదముట్టిస్తున్న హీరోలకు ఈ ఏఐ విలన్ ను తట్టుకోలేకపోతున్నారు.

# మరోసారి హాట్ టాపిక్‌గా మారిన కొండా ఫ్యామిలీ



వరంగల్ : వరంగల్ కాంగ్రెస్‌లో నెలకొన్న విభేదాలు.. చిలికి..చిలికి గాలివానలా మారుతున్నాయ్. మంత్రి కొండా సురేఖ వర్సెస్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలుగా ఉన్న పంచాయితీ.. ఇప్పుడు ఇద్దరు సహచర మంత్రుల మధ్య రాజుకుందనే చర్చ.. పొలిటికల్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ పంచాయితీ.. ఏకంగా ఏఐసీసీ పెద్దల కోర్టులోకి చేరింది. ఇంతకీ.. ఓరుగల్లు నేతల మధ్య విభేదాలకు రీజనేంటి? సడన్‌గా సీఎం సీన్‌లోకి ఎందుకొచ్చారు? కొండా సురేఖ నెక్ట్స్ స్టెప్ ఎలా ఉండబోతోంది?ఆ మధ్య.. సొంత పార్టీ ఎమ్మెల్యేలపై మంత్రి కొండా సురేఖ భర్త కొండా మురళి చేసిన వ్యాఖ్యలు.. వరంగల్ జిల్లాలో రాజకీయ ప్రకంపనలు పుట్టించాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు ఒక్కటిగా జట్టుకట్టి.. కొండా ఫ్యామిలీపై అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదుకు ప్రతిగా.. కొండా మురళీ కాంగ్రెస్ ఎమ్మెల్యేలందరిపై కౌంటర్ ఫిర్యాదు చేసి ఓరుగల్లు పొలిటికల్ సర్కిల్‌లో మరింత హీట్ పెంచారు. పరిస్థితి చేయిదాటుతుందని గమనించిన అధిష్టానం.. ఇద్దరికీ సర్ది చెప్పడంతో కొన్నాళ్లు సైలెంట్ అయ్యారు. దీంతో హస్తం పార్టీలో నేతల మధ్య పోరుకు ఫుల్‌స్టాప్ పడిందని భావించారు. అయితే.. గత నెలలో భద్రకాళి ఆలయ ధర్మకర్తల నియామకం విషయంలో.. వరంగల్ వెస్ట్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, మంత్రి కొండా సురేఖ మధ్య మళ్లీ పంచాయితీ మొదలైంది. మంత్రి కొండా సురేఖ.. ఎమ్మెల్యే నాయినిపై వ్యంగ్యాస్త్రాలు సంధించడంతో.. నాయిని ఘాటుగా స్పందించారు. దాంతో.. నివురుగప్పిన నిప్పులా తూర్పు, పశ్చిమ ఎమ్మెల్యేల మధ్య వైరం కొనసాగుతోందనే చర్చ జరుగుతోంది.మంత్రి కొండా సురేఖ పంచాయితీ ఇప్పుడు ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలను దాటి.. మంత్రి పొంగులేటిపైకి మళ్లింది. వరంగల్ ఇంచార్జ్ మంత్రిగా ఉన్న పొంగులేటి, తనకు తెలియకుండానే తన శాఖలో జోక్యం చేసుకుంటున్నారని.. మంత్రి కొండా సురేఖ ఫైర్ అవుతున్నారట. తాజాగా మేడారం సమ్మక్క-సారలమ్మల గద్దెల అభివృద్ధి, చుట్టూ ప్రాకారం నిర్మాణానికి.. దాదాపు 72 కోట్లతో దేవాదాయ శాఖ టెండర్లకు పిలుపిచ్చింది. అయితే.. తన శాఖ టెండర్లలో, తనకు తెలియకుండానే మంత్రి పొంగులేటి బిడ్డింగ్‌లో పాల్గొన్నారట. అంతేకాదు.. దేవాదాయ శాఖ ఉన్నతాధికారులతో టచ్‌లో ఉంటూ టెండర్ వ్యవహారంలో అనుకూలంగా వ్యవహరించాలని ఆదేశాలు జారీచేస్తున్నారట. ఈ విషయం దేవాదాయ శాఖ ఉన్నతాధికారి ఒకరు.. మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకురావడంతో ఆమె తీవ్రంగా పరిగణిస్తూ అధికారులకు వార్నింగ్ ఇచ్చినట్లుగా తెలుస్తోంది. మరోవైపు.. ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జ్ మంత్రిగా ఉన్న తన మాటే వినాలని, అధికారులపై పొంగులేటి సీరియస్ కావడంతో.. ఈ విషయంలో తాడోపేడో తేల్చుకోవాలని కొండా సురేఖ భావించారట.సంవత్సరం క్రితం భద్రకాళి ఆలయ అభివృద్ధి పనుల వ్యవహారంలోనూ.. మంత్రి పొంగులేటి తలదూర్చాడని గుర్రుగా ఉన్న మంత్రి కొండా సురేఖ.. ఇప్పుడు తన శాఖ వ్యవహారాల్లో.. తనకు తెలియకుండా మంతనాలు జరపడాన్ని సీరియస్‌గా తీసుకున్నట్లు తెలుస్తోంది. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో పోలీసు అధికారుల ట్రాన్స్‌ఫర్లు, పోస్టింగ్‌ల విషయంలో తలదూర్చి.. తమపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారు.. మంత్రి పొంగులేటిపై క్రమశిక్షణ కమిటీకి.. కొద్ది నెలల క్రితమే కొండా మురళి ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి పొంగులేటి తీరుపై ఆగ్రహంగా ఉన్న కొండా ఫ్యామిలీ.. తన శాఖలో కూడా పొంగులేటి అజమాయిషీ చేయడాన్ని అస్సలు తట్టుకోలేకపోతున్నా రట. అందుకే.. ఢిల్లీ పెద్దల దగ్గరే ఈ వ్యవహారం తేల్చుకునేందుకు సిద్ధమయ్యారని తెలుస్తోంది. మరోవైపు.. మేడారం పనుల టెండర్ ఆన్‌లైన్ ప్రక్రియ, టెండర్ వేస్తే సహించరా అంటూ.. కొండా తీరుపై పొంగులేటి సైతం ఫైర్ అవుతున్నారట. టెండర్ వేయడంపై అభ్యంతరం లేదని.. తన శాఖలోని అధికారులపై పెత్తనం చేయడమేంటని గుర్రుగా ఉన్నారట మంత్రి కొండా సురేఖ.గత ఏడాదిన్నర కాలంగా ఇంచార్జ్ మంత్రి హోదాలో తమ ప్రాబల్యాన్ని తగ్గించే ప్రయత్నం చేయడమే కాకుండా.. ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలతో కలిసి తనకు వ్యతిరేకంగా పనిచేశారని, తన పరిధిలోని పనుల విషయంలోనూ.. తనకు తెలియకుండా వ్యవహరిస్తున్నారని పొంగులేటిపై.. కొండా ఫ్యామిలీ ఆగ్రహంతో రగిలిపోతోంది. ఇప్పుడు ఏకంగా తన శాఖలోనే తలదూర్చడంతో తాడో పేడో తేల్చుకోవాల్సిందేనని భావిస్తున్నారట మంత్రి కొండా సురేఖ. ఈ పంచాయతీ ఢిల్లీ పెద్దల వరకూ చేరితేనే.. సమస్యకు పరిష్కారం దొరుకుతుందని కొండా మురళీ సైతం భావించారట. అయితే.. ఇంతలోనే ఈ ఎపిసోడ్‌లోకి అనూహ్యంగా సీఎం రేవంత్ రెడ్డి ఎంట్రీ ఇవ్వడంతో.. సీన్ మొత్తం రివర్స్ అయింది. కొండా, పొంగులేటి మధ్య నెలకొన్న వివాదంపై ముఖ్యమంత్రి సీరియస్ అయ్యారు. లేటెస్ట్ కాంట్రవర్సీతో పాటు వరంగల్ జిల్లా కాంగ్రెస్‌లో వరుసగా జరుగుతున్న ఎపిసోడ్‌లపై.. అధిష్టానానికి అన్నీ వివరిస్తూ.. పూర్తి నివేదిక పంపారు. ఇప్పటికే.. మేడారం జాతర లోపు పనులు పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సర్కార్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పనులపైనా.. వివాదం చేయడంపై సీఎం సీరియస్ అయ్యారు. సీన్‌లోకి సీఎం ఎంట్రీ ఇవ్వడంతో.. కొండా ఫ్యామిలీ కొన్నాళ్లు సైలెంట్ అవుతుందా? లేక.. తమదారిలోనే వెళ్లి ఏఐసీసీ పెద్దలతో ఈ విషయాన్ని తేల్చుకుంటుందా? అన్నది ఆసక్తి రేపుతోంది.

### వీఏవోలకు ప్రభుత్వం శుభవార్త

అమరావతి, గత వైసీపీ ప్రభుత్వంలో వీఓఏలకు విధించిన కాలపరిమితిపై చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కాలపరిమితిని రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు సెర్ప్ సీఈవో వాకాటి కరుణ ఉత్తర్వులు జారీ చేశారు. మరోవైపు ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో వీఓఏల ప్రతినిధి బృందం వెలగపూడి సచివాలయంలో సమావేశమైంది.

# ఆ ..ఆటో డ్రైవర్ కోటీశ్వరుడు

బెంగుళూరు, సాధారణ ఆటో డ్రైవర్ కోట్లకు పడగలెత్తిన విషయం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఒక ఆటో డ్రైవర్ మహా అయితే రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకు సంపాదిస్తుంటాడు. ఇక కొన్నిసార్లు ప్యాసింజర్లు లేకపోతే ఆటోవాలా పరిస్థితి అంతంతే. రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితుల్లో రోజంతా కష్టపడుతూ కుటుంబాన్ని అతికష్టం మీద పోషిస్తుంటారు. ట్రాఫిక్‌లో నానా అవస్థలు పడుతూ, ప్యాసింజర్ల కోసం ఆరాటపడడడంలోనే రోజంతా గడిచిపోతుంది. ఇంటి ఖర్చులు, అప్పులు పోనూ చేతికి మిగిలేది అంతంతే. ఇక తెలుగు రాష్ట్రాల్లో అయితే చెప్పనక్కర్లేదు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మొదలైనప్పటి నుంచి ఆటో నడుపుకునే వారి పరిస్థితి మరింత దిగజారింది. తమకు న్యాయం చేయాలని ప్రభుత్వానికి ఎన్నో సార్లు మొరపెట్టుకున్నారు. ఇదిలా ఉంటే.. ఆటోలో ప్రయాణిస్తున్న ఓ ప్యాసింజర్‌కు వినూత్న అనుభవం ఎదురైంది. కార్పొరేట్ మేనేజర్ కంటే ఎక్కువగా ఆటో డ్రైవర్ డబ్బులు సంపాదిస్తున్నాడని తెలిసి ఒక్కసారిగా అవాక్కయ్యాడు. కర్ణాటక రాజధాని బెంగుళూరుకు చెందిన ఆకాష్ ఆనందానీ అనే వ్యక్తి ఈ విషయాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. పోస్ట్ చూసి షాక్ తింటున్న యూజర్లు షేర్ చేయడంతో అది కాస్త వైరల్‌గా మారింది. ఆఫీస్ పనికోసం వెళ్తున్న ఆకాష్ ఆనందానీ, ఆటోలో బయల్దేరాడు. ఆటోవాలా పక్కన కూర్చొని ఆటో నడుపుతుండగా అతని చేతికున్న యాపిల్ వాచ్, ఎయిర్ పోడ్స్ చూసి ఒక్కసారిగా షాక్ అయ్యాడు. ఆటో డ్రైవర్‌కి యాపిల్ వాచ్ ఏంటని.. పూర్తి విషయాలు తెలుసుకుందామని అతనిని అడిగాడు. ఆటోడ్రైవర్ సమాధానాలు విని ఆ ప్యాసింజర్ ఒక్కసారిగా అవాక్కయ్యాడు. తనకు రూ.4-5 కోట్ల విలువచేసే రెండు ఇళ్లు ఉన్నాయని, వాటిని అద్దెకు ఇస్తే నెలకు రూ.2-3 లక్షల ఆదాయం వస్తుందని ఆటోవాలా చెప్పుకొచ్చాడు. అంతేకాదు ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ స్టార్టప్ కంపెనీలో భారీ పెట్టుబడి సైతం పెట్టినట్లు చెప్పాడు. వారం మొత్తం తాను ఆటో నడపనని.. కేవలం వారాంతంలో మాత్రమే తాను ఆటో నడుపుతానని చెప్పుకొచ్చారు. ఆటో డ్రైవర్ చెప్పిన విషయాలకు నివ్వెరపోయిన ఆ ప్యాసింజర్.. ఈ విషయాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. అది కాస్త వైరల్ అయింది.

# మరింత పెరిగిన బంగారం ధరలు

హైదరాబాద్,బంగారం ధర రోజూ పెరుగుతూ సరికొత్త రికార్డులను నమోదు చేస్తోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ. 1, 24, 260కు చేరుకుంది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 1, 13, 900కి చేరింది. ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 1, 24, 410కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 1, 14, 050కి చేరుకుంది. మరోవైపు వెండి కూడా పరుగులు తీస్తోంది. నిన్నటితో పోల్చుకుంటే ఈ రోజు కిలో వెండి ఏకంగా 3000 రూపాయలు పెరిగింది. హైదరాబాద్‌లో కిలో వెండి ధర 1, 87, 000కు చేరుకుంది. దేశ రాజధాని ఢిల్లీలో వెండి ధర రూ. 1, 77, 000గా ఉంది. ఈ ఏడాది చివరి నాటికి కిలో వెండి ధర రెండు లక్షల రూపాయలకు చేరుకుంటుందని నిపుణులు అంచనా వేశారు. అయితే ప్రస్తుతం సిల్వర్ వేగం చూస్తుంటే అంత సమయం పట్టేలా కనిపించడం లేదు.

# భవిష్యత్ అగమ్యగోచరమేనా?

హైదరాబాద్,ఉప ఎన్నికతో జూబ్లీహిల్స్ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. మూడు ప్రధాన పార్టీల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఇప్పటికే తమ అభ్యర్థులను ఎంపిక చేయగా, బీజేపీ నేడో రేపో తన అభ్యర్థి పేరు ఖరారు చేయనుంది. అయితే జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో గట్టిపట్టున్న మాజీ మంత్రి పీజేఆర్ కుటుంబం నుంచి ఎవరూ పోటీ చేయకపోవడం, చివరికి పీజేఆర్ కుటుంబ సభ్యుల పేర్లను పరిశీలనకు తీసుకోకపోవడంపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. పీజేఆర్ కుమారుడు మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి బీఆర్ఎస్ లో ఉండగా, కుమార్తె విజయారెడ్డి కాంగ్రెస్ లో ఉన్నారు. ఈ ఇద్దరిని కనీసం పరిగణనలోకి తీసుకోకపోవడంతో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పీజేఆర్ కుటుంబం ప్రాబల్యం తగ్గిపోయిందా? అనే చర్చ మొదలైంది.2009 ముందు ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో జూబ్లీహిల్స్ ఉండేది. 2009లో నియోజకవర్గాల పునర్విభజనతో జూబ్లీహిల్స్ ఏర్పడింది. ఇప్పటికి నాలుగు సార్లు ఎన్నికలు జరిగితే ఒక సారి కాంగ్రెస్, ఒకసారి టీడీపీ, రెండు సార్లు బీఆర్ఎస్ గెలిచింది. అయితే కాంగ్రెస్ తరపున గెలిచిన విష్ణువర్ధన్ రెడ్డి ప్రస్తుతం రాజకీయంగా చురుకుగా వ్యవహరిస్తున్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్ దక్కకపోవడంతో బీఆర్ఎస్ లో చేరారు. 2009లో గెలిచిన విష్ణు 2014, 2018 ఎన్నికల్లో సైతం పోటీ చేశారు. కానీ ఓటమి చెందారు. ఈ నేపథ్యంలో గత ఎన్నికల్లో ఆయనకు పార్టీ టికెట్ నిరాకరించింది. దీంతో చివరి నిమిషంలో విష్ణు బీఆర్ఎస్ కండువా కప్పుకున్నారు. ఎన్నికల్లో పోటీ చేయకపోయినా, పార్టీ ఓటమి పాలైనా గత రెండేళ్లుగా విష్ణు బీఆర్ఎస్ తరుపున చురుకుగా వ్యవహరిస్తున్నారు. కానీ, బీఆర్ఎస్ ఆయన పేరును కనీసం పరిశీలనకు తీసుకోలేదు. ఈ విషయమే ఇప్పుడు జూబ్లిహిల్స్ నియోజకవర్గంలోని విష్ణు తండ్రి పీజేఆర్ అభిమానులను కలవరపెడుతోంది.నిజానికి జూబ్లిహిల్స్ నియోజకవర్గ పరిధిలో పీజేఆర్ ప్రాబల్యం ఇప్పటికీ కనిపిస్తుంది. ఆయన భౌతికంగా లేకపోయినా, పీజేఆర్ అభిమానులు ఆయన పేరిట పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేస్తుంటారు. దీంతో ఈ నియోజకవర్గంలో పీజేఆర్ కుటుంబానికి పెద్ద ఎత్తున మాస్ ఫాలోయింగ్ ఏర్పడింది. అయితే ఇది ఎన్నికల్లో గెలిపించేందుకు ఉపయోగపడకపోవడంతో పీజేఆర్ కుమారుడు వరుసగా మూడు సార్లు ఓడిపోవాల్సివచ్చిందని అంటున్నారు. పీజేఆర్ స్థాయిలో ప్రజల్లోకి చొచ్చుకువెళ్లలేకపోవడం వల్ల విష్ణు రాజకీయంగా వెనకబడిపోయారన్న విశ్లేషణలు ఉన్నాయి. అయితే గత ఎన్నికల్లో ప్రత్యామ్నాయం చూపుతామని బీఆర్ఎస్ విష్ణును పార్టీలోకి తీసుకుందని, కానీ ఇప్పుడు అవకాశం ఉన్నప్పటికీ విస్మరించారని, దీనికి కారణాలు ఏమైవుంటాయనే చర్చ ఎక్కువగా వినిపిస్తోంది.గత ఎన్నికల్లో పోటీకి విశ్వప్రయత్నం చేసిన విష్ణు కాంగ్రెస్ పార్టీ హ్యాండ్ ఇవ్వడంతో బీఆర్ఎస్ లోకి వెళ్లాల్సివచ్చిందని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. విష్ణు పార్టీ మార్పు వల్లే 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి అజారుద్దీన్ గెలవలేకపోయారని అంటున్నారు. అయితే ఇప్పుడు టికెట్ దక్కించుకోలేని విష్ణు పార్టీ అభ్యర్థి మాగంటి సునీత గెలుపు కోసం పనిచేస్తారా? లేదా? అన్నదే సస్పెన్స్ గా మారింది. ప్రస్తుతం సానుభూతి పేరుతో మాగంటి సునీతకు టికెట్ ఇచ్చారని, నెక్ట్స్ ఎన్నికలకు అభ్యర్థిని తానేనని విష్ణు తన సన్నిహితుల వద్ద చెబుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఈ విషయంపై బీఆర్ఎస్ పార్టీ హైకమాండ్ హామీ ఇచ్చింది లేనిదీ మాత్రం క్లారిటీ లేదని రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

### వేములవాడలో విస్తరణ పనులు

వేములవాడ, వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానము ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు చేపడుతున్నందున భక్తుల దర్శనాలు, పూజలను భీమేశ్వరాలయానికి మార్చారు. భక్తుల సౌకర్యార్థం మ్రొక్కుబడులు, ఆర్జిత సేవలకొరకై, అనగా కోడె మ్రొక్కుబడి, అభిషేకములు, అన్నపూజ, కుంకుమపూజ, నిత్య కళ్యాణము, చండి హెమం, మొదలగు మ్రొక్క బడులు తీర్చుకొనుటకు

# మోడీకి పరువు సెగ: జాతీయ స్థాయిలో రచ్చ!



న్యూఢిల్లీ,ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి తాజాగా రెండు కీలక విషయాలు.. సెగ పెంచాయి. అవి రెండు కూడా.. పరువుతో కూడుకున్నవి కావడం.. హైప్రొఫైల్ సమస్యలు కావడం గమనార్హం. దీంతో ఇప్పుడు ఆయన స్పందనపై జాతీయస్థాయిలో రచ్చ సాగుతోంది. కానీ, మిన్ను విరిగి మీద పడ్డా.. తన మౌనాన్ని మోడీ విడిచి పెట్టడం లేదు. గతంలో వ్యవసాయ చట్టాలు తెచ్చినప్పుడు భారీ ఎత్తున ఆందోళనలు సాగాయి. ఈ నేపథ్యంలోనూ మోడీ మౌనం వహించారు. అమెరికా విధించిన సుంకాలపైనా ఇప్పటి వరకు నోరు విప్పలేదు.ఇలా.. అనేక సమస్యలు మోడీని చుట్టుముట్టిన ప్రతిసారీ ఆయన మౌనంగానే ఉంటున్నారు. అయితే.. తాజాగా మాత్రం.. ఆయన నోరు విప్పక తప్పని పరిస్థితి ఏర్పడిందని విశ్లేషకులు చెబుతున్నారు. దీనిలో ప్రధానంగా మహిళా జర్నలిస్టుల కేసు.. జాతీయ మీడియాను కుదిపేస్తోంది. ఇక, ఐపీఎస్ ఆత్మహత్య కేసు కూడా ఇదే తరహా ఐపీఎస్, ఐఏఎస్‌ల మధ్య అగాథాన్ని పెంచుతోంది. ఈ రెండు పరిణామాలు కూడా.. ఢిల్లీకి చేరువలోనే చోటు చేసుకున్నాయి. అయితే.. మోడీ మాత్రం మౌనంగానే ఉన్నారు.విషయంలోకి వెళ్తే.. అఫ్ఘాన్‌ను పాలిస్తున్న తాలిబాన్లతో భారత్ స్నేహం చేస్తోంది. ఈ క్రమంలో తాలిబాన్ల మంత్రి ఒకరు ఇటీవల భారత్ పర్యటనకు వచ్చారు. మంత్రులతో చర్చలు జరిపారు. అనంతరం.. మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. అయితే.. మహిళా జర్నలిస్టులను ఈ సమావేశానికి రాకుండా అడ్డుకున్నారు. ఈ వ్యవహారంపై ప్రతిపక్షాలు, మానవహక్కులు, మహిళా హక్కుల సంఘాలు.. సహా తటస్థులుకూడా కేంద్రంపై నిప్పులు చెరుగుతున్నారు. సమానత్వం అంటే ఇదేనా?. ఇంత జరిగినా..కేంద్రం ఎందుకు పట్టించుకోవడం లేదు.. మోడీ ఎందుకు మౌనంగా ఉంటున్నారన్నది వారి నిలదీత.ఇక, హరియాణాలో ఏపీకి చెందిన ఐపీఎస్ (ఐజీ స్థాయి) అధికారి పూరణ్ కుమార్ తన సర్వీస్ రివాల్వర్‌తో ఆత్మహత్యకు ఒడిగట్టాడు. అయితే.. ఈ కేసులో కుల వివక్ష ప్రధానంగా పాత్ర పోషించదని ఆయన సతీమణి.. సీనియర్ ఐఏఎస్ అధికారి ఆరోపిస్తున్నారు. అంతేకాదు.. తాను ఫిర్యాదు చేస్తే.. పోలీసులు కేసు కూడా నమోదు చేయలేదని చెబుతున్నారు. నిజానికి ఆత్మహత్యలు చేసుకున్న ఐపీఎస్‌లు చాలా మందే ఉన్నా.. ఉద్యోగంలో పై అధికారులు తనపట్ల కుల, వర్ణ వివక్ష చూపించారని ఆధారాలతో సహా మృతి చెందిన ఐపీఎస్ నోట్ రాశారు.ఈ పరిణామాలు ఐఏఎస్-ఐపీఎస్‌ల మధ్య వివాదాన్ని పెంచాయి. దీనిపై కేంద్రం మౌనంగా ఉండడాన్ని ఐఏఎస్‌ల సంఘం ప్రశ్నించింది. మోడీ జోక్యం చేసుకోవాలని కోరుతున్నా యి. ఒకవైపు బీహార్ ఎన్నికలు ఉన్న నేపథ్యంలో మోడీ రియాక్షన్ తప్పదు. కానీ, ఆయన మాత్రం మౌనంగానే ఉన్నారు.

# జూబ్లీహిల్స్ బీజేపీ అభ్యర్థిగా ఇతనే..?



హైదరాబాద్,జూబ్లీహిల్స్ లో పాగా వేసేందుకు భారతీయ జనతా పార్టీ (బీజేపీ) గట్టిగా ప్రయత్నిస్తోంది. ఎవరి అంచనాలకు అందని వ్యూహాలను రచిస్తోంది. ఇది వచ్చే ఎన్నికలకు గీటురాయిగా తీసుకుంటామని చెప్తోంది. తెలంగాణ రాజకీయాల్లో జూబ్లీహిల్స్ కేవలం ఒక ఉప ఎన్నిక కాదు.. ఇది ప్రధాన పార్టీలకు ప్రతిష్ఠాత్మక సమరం. హైదరాబాద్ కు హృదయంగా ఉన్న ఈ ప్రాంతం నియోజకవర్గం బహుళ మతాల, వర్గాల ఓటర్లతో కూడిన సమీకరణాల కేంద్రం. రాబోయే ఎన్నికల దశను సూచించే సూచికగా మారుతుంది.

పార్టీల కసరత్తు

బీఆర్ఎస్ తమ పార్టీ నుంచి సునీతను ప్రకటించింది. కాంగ్రెస్ నవీన్ యాదవ్ పేరును ప్రకటిస్తూ తన బలాన్ని చూపించే ప్రయత్నం చేసింది. ఇక బీజేపీ మాత్రం చివరి నిమిషం వరకు లెక్కలు వేసుకుంటూ వ్యూహాత్మక చర్చలతో ముందుకెళ్లింది. తెలంగాణలో పట్టు పెంచుకోవాలనే సంకల్పంతో బీజేపీకి ఈ ఉప ఎన్నిక ఒక 'టెస్టింగ్ గ్రౌండ్' లాంటిదని చెప్పవచ్చు. ఢిల్లీలో జరిగిన పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశానికి దీపక్‌రెడ్డి, కీర్తిరెడ్డి, మాధవీలత పేర్లతో జాబితా వెళ్లినప్పటికీ చివరి నిమిషంలో దీపక్‌రెడ్డి వైపే పార్టీ పెద్దలు మొగ్గు చూపిస్తున్నట్లు సమాచారం. అయితే, పార్టీ తుది ప్రకటనలో కొంత వ్యూహాత్మక ఆలస్యం చేయడం గమనార్హం.ఇది యాదృచ్ఛికం కాదు.. బీజేపీ తన అభ్యర్థిని చివరి నిమిషంలో ప్రకటించడం వెనుక భారీ వ్యూహం ఉందని నిపుణులు చెప్తున్నారు. నియోజకవర్గంలో సుమారు లక్ష మంది ముస్లిం ఓటర్లు ఉన్నందున, అభ్యర్థి ఎంపికలో సామాజిక సమీకరణాల సున్నితత్వాన్ని పార్టీ స్పష్టంగా పరిగణనలోకి తీసుకుంటోంది.

తెరపైకి దీపక్ రెడ్డి పేరు..

2023 అసెంబ్లీ ఎన్నికల్లో దీపక్‌రెడ్డి జూబ్లీహిల్స్ నుంచి పోటీ చేసి 25,866 ఓట్లు సాధించారు. ఆ సమయంలో గెలుపు సాధించకపోయినా, ఆయనకు స్థానికంగా ఉన్న మద్దతును పార్టీ గుర్తించింది. ఈసారి మళ్లీ ఆయన్ని బరిలోకి దించాలని భావించడం ద్వారా ఓటర్లను ఆకర్షించాలనే ప్రయత్నం చేసింది. మాధవీలత పేరు కూడా పరిగణనలోకి వచ్చినా, ఆమెకు నగరవ్యాప్తంగా గుర్తింపు ఉంది. కానీ జూబ్లీహిల్స్ లాంటి నియోజకవర్గంలో స్థానికత కీలకం కావడంతో, దీపక్‌రెడ్డి వైపే పార్టీ మొగ్గు చూపూలా కనిపిస్తుంది.

చివరి నిమిషం సర్ప్రైజ్

బీజేపీ తరచూ ఉపయోగించే ఒక వ్యూహం 'ఎదురుచూపే' అభ్యర్థిని చివరి నిమిషం వరకు ప్రకటించదు. పార్టీ అంతర్గతంగా చర్చలతో స్థానిక అసంతృప్తిని నివారిస్తుంది. అలాగే మీడియాను అటెన్షన్ కు గురి చేస్తుంది. కర్ణాటక, గుజరాత్, ఉత్తరప్రదేశ్‌లో సైతం ఇదే పద్ధతి ఉపయోగించింది. జూబ్లీహిల్స్‌లో ఇదే వ్యూహం తిరిగి అమలవుతుందనిపిస్తోంది. అభ్యర్థిని ప్రకటించే సమయానికే ప్రచారం ఊపు తెచ్చేలా చేయడం. దీని ద్వారా మొదటి రోజునుంచే 'హైలైట్' ఎఫెక్ట్ సృష్టించవచ్చు అని పార్టీ భావిస్తుంది.

బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య మౌన పోటీ

బీఆర్ఎస్ అభ్యర్థి సునీతకు స్థానిక స్థాయిలో బలమైన మద్దతు ఉన్నప్పటికీ, ప్రస్తుత పరిస్థితులను పార్టీ అంచనా వేయలేకపోతోంది. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ యువతలో ప్రభావం చూపుతారని కాంగ్రెస్ బలంగా నమ్ముతోంది. బీజేపీ ప్రవేశం రెండు పార్టీలకూ సవాల్‌గా మారనుంది. జూబ్లీహిల్స్‌లో త్రిముఖ పోటీ తప్పదని నిపుణులు అంటున్నారు. ఇది రాబోయే 2028 అసెంబ్లీ ఎన్నికలకు ఒక మూడ్ క్రియేట్ చేస్తుందని భావిస్తున్నారు. హైదరాబాద్ వంటి నియోజకవర్గాల్లో ఓటర్ల మద్దతు ఎలా ఉందో, బీజేపీ ఆ దిశను అంచనా వేసుకునే అవకాశం ఇది.జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీ తీసుకున్న వ్యూహాత్మక నిర్ణయం కేవలం ఒక అభ్యర్థి ఎంపిక కాదు.. ఇది పార్టీ భవిష్యత్ దిశకు సంబంధించిన సూచిక. తెలంగాణలో తాము స్థిరపడిన పట్టు చూపించాలంటే నగర రాజకీయాల్లో గెలుపు తప్పనిసరి. బీఆర్ఎస్ తన స్థానిక బలం నిలబెట్టుకోవాలని ప్రయత్నిస్తుండగా.. కాంగ్రెస్ కొత్త ముఖంతో ఓటర్లను ఆకర్షించుకోవాలనే యత్నం చేస్తోంది. ఈ నేపథ్యంలో బీజేపీకి దీపక్‌రెడ్డిని అనూహ్యంగా తెరపైకి తెచ్చింది.ఎన్నో ఎదురు చూపుల మధ్య జూబ్లీహిల్స్ బైపోల్ తెలంగాణ రాజకీయ వేదికపై పెద్ద 'సిగ్నల్ సీటు'గా మారబోతోంది. ఇక్కడి ఫలితం కేవలం ఒక అభ్యర్థి గెలుపు కాదు.. మూడు పార్టీల భవిష్యత్ దిశను నిర్ణయిస్తుంది.

# ఏపీ రాజధాని మీద లోకేష్ సంచలన వ్యాఖ్యలు

అమరావతి,ఏపీలో రాజధాని ఇష్యూ అన్నది ప్రజలు తేల్చేసిన వ్యవహారంగానే చూడాల్సి ఉంది. 2024 ఎన్నికల్లో ప్రజలు కూటమి ప్రభుత్వానికి వన్ సైడెడ్ గా జై కొట్టేశారు. దాంతో వైసీపీ మూడు రాజధానుల వ్యవహారం పూర్తిగా మరుగున పడిపోయింది. ఇక వైసీపీ నేతలు కూడా మూడు రాజధానుల గురించి ఎక్కడా మాట్లాడడం లేదు, సమయం వచ్చినపుడు ఈ అంశం మీద స్పందించాలన్నది ఆ పార్టీ విధానంగా ఉంది. ఈ నేపథ్యంలో జనాలు కూడా అమరావతి ఏకైక రాజధాని స్పష్టంగానే ఉన్నారు. అంతే కాదు అమరావతి రాజధాని విషయంలో చూస్తే కనుక కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున ఫోకస్ పెడుతోంది. అనేక ఆర్థిక ఏజెన్సీల నుంచి నిధులను తెచ్చి పూర్తి చేసేందుకు కూడా ప్రయత్నం చేస్తోంది.

ఏకైక రాజధానిగా :

అమరావతి రాజధాని తొలి దశ పనులను 2028 నాటికి పూర్తి చేయాలని తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఒక కాల పరిమితిని నిర్ణయించుకుంది. ఈ క్రమంలో ఆ దిశగానే పనులు అన్నీ వేగంగా సాగుతున్నాయి. ఈ క్రమంలో విశాఖ వచ్చిన నారా లోకేష్ రాజధాని మీద ఆస్కతికరమైన వ్యాఖ్యలే చేశారు. ఏపీ రాజధానిగా ఒక్కటే ఉంటుందని అదే తమ విధానం అని ఫుల్ క్లారిటీగా చెప్పారు. అంటే వైసీపీ మూడు రాజధానుల నినాదాన్ని ఆయన పూర్తిగా తోసిపుచ్చడమే కాదు ఎప్పటికీ అది చెల్లదని స్పష్టం చేశారు అని భావించాలి. అదే సమయంలో తమ విధానం అభివృద్ధి వికేంద్రీకరణ అని ఆయన చెప్పారు

ఫోకస్ విశాఖ :

విశాఖను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని లోకేష్ చెప్పారు. విశాఖని ఐటీ హబ్ గా చేస్తామని ఆయన అన్నారు. విశాఖలో వరసబెట్టి దిగ్గజ ఐటీ కంపెనీలు వస్తున్నాయని, రానున్న కాలంలో మరిన్ని కంపెనీలు వస్తాయని కూడా ఆయన చెప్పుకొచ్చారు. దీని వల్ల ఏపీ వ్యాప్తంగా ఇరవై లక్షల దాకా ఉద్యోగాలు వస్తే ఉత్తరాంధ్రా విశాఖ ప్రాంతంలో అయిదు



లక్షల దాకా ఉద్యోగాలు వస్తాయని ఆయన వివరించారు.

నోరెత్తకుండానేనా :

లోకేష్ ఈ విధంగా ఎందుకు మాట్లాడారు అన్నది కూడా చర్చగా ఉంది. ఇపుడు అమరావతి అన్నది రాజధాని అని అందరికీ తెలుసు. ఏకైక రాజధాని అని కూడా తెలుసు. అయినా లోకేష్ ఈ విధంగా చెప్పడం వెనక వ్యూహాత్మకమైన వైఖరి ఉందని అంటున్నారు. కేవలం అమరావతి మీదనే ఫోకస్ పెట్టి ఇతర ప్రాంతాలను నిర్లక్ష్యం చేస్తున్నారు అన్నది వైసీపీ వంటి పార్టీలు ఎపుడూ ప్రచారం చేయకుండా ఆ తరహా విమర్శలు భవిష్యత్తులో ఎక్కడా తలెత్తకుండా అభివృద్ధి వికేంద్రీకరణ అంటూ లోకేష్ ప్రభుత్వ విధానం పదే పదే చెబుతున్నారు అని అంటున్నారు. దీంతో పాటు సహజంగానే విశాఖ విషయంలో ఒక ఆశ ఉంటుంది రాజధాని కావాల్సిన ప్రాంతం అని కూడా అంటారు. వైసీపీ కూడా విశాఖను పరిపాలనా రాజధాని చేస్తామని చెబుతూ వచ్చింది. దీంతో ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని ఎక్కడా ఎలాంటి అసంతృప్తి ఎవరిలీ తలెత్తకుండా ఫుల్ క్లారిటీతో లోకేష్ ఈ విధంగా చెబుతున్నారు అని అంటున్నారు.

# ఉచిత పథకాలు ఎవరికి? : పవన్ సంచలన కామెంట్



అమరావతి,ఏపీ రాజకీయాల్లో సంచలనం చోటు చేసుకుంది. కూటమి ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉన్న జనసేన అధినేత పవన్ కల్యాణ్.. తాజాగా చేసిన ఓ వ్యాఖ్య రాజకీయంగా తీవ్ర చర్చకు దారి తీసింది. సందర్భాన్ని సృష్టించుకుని చేసినట్టుగా ఉన్న వ్యాఖ్యల అంతరార్థంపైనా చర్చ జరుగుతోంది. అసలు ఈ వ్యాఖ్యలు ఇప్పుడే ఎందుకు చేయాలన్నది కూడా ప్రశ్నలకు దారి తీసింది. "ఉచిత పథకాలు ఎవరికి? ఎందుకు?" అనే కోణంలో పవన్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా దుమారం రేపుతున్నాయి.

విషయం ఏంటంటే..

2018, అక్టోబరు 12న(ఖచ్చితంగా ఆదివారం రోజు) పవన్ కల్యాణ్.. ఉత్తరాంధ్రలో పర్యటించారు. పంచెక ట్టు.. ధవళ వస్త్రాల్లో ఉన్న ఆయన పొలం పనులను పరిశీలించారు. రైతులతోనూ.. రైతు కూలీలతోనూ ఆయన భేటీ అయి.. వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సమయంలోనే కొందరు యువత ఆయనను కలుసుకున్నారు. వారి సమస్యలు చెప్పుకొన్నారు. ప్రధానంగా నిరుద్యోగాన్ని ఆనాడు ప్రశ్నించారు. తాము చదువుకుని కూడా నిరుద్యోగులుగా ఉండిపోతున్నామని.. ఉపాధి కల్పించాలని కోరుకున్నారు.

కట్ చేస్తే..

ఆ నాడు తీసిన ఫొటోను.. ఏడేళ్ల తర్వాత ప్రస్తుతం మంత్రిగా ఉన్న... జనసేన నాయకుడు నాదెండ్ల మనో హర్.. తాజాగా సోషల్ మీడియాలో పోస్టు చేశారు. దీనిని చూసిన పవన్ కల్యాణ్.. రీ పోస్టు చేస్తూ.. ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "ఏపీలో యువత ఉచితాలు, సంక్షేమ పథకాలు అడగడం లేదు. 25 సంవత్సరాల భవితను కోరుకుంటున్నారు." అని పేర్కొన్నారు. అయితే.. ఇవి సర్కారు అను సరిస్తున్న విధానాలపై ఆయన చేసిన వ్యాఖ్యలుగానే ఉన్నాయంటూ.. ప్రతిపక్ష నాయకులు విమర్శలు చేస్తున్నారు.ఇటీవల మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు కూడా.. ఇదే తరహాలో వ్యాఖ్యలు చేశారు. ఉచితాలు అనుచితాలు అంటూ.. ఆయన పేర్కొన్నారు. ఉచిత బస్సు ఎందుకని ప్రశ్నించారు. ఉపాధి మార్గాలు చూపించాలని సూచించారు. ఉదయం అంతా సంక్షేమం కింద డబ్బులు ఇస్తూ.. సాయంత్రం అయ్యే సరికి.. మద్యం రూపంలో లాగేస్తున్నారని రెండు తెలుగు రాష్ట్రాలపైనా ఆయన విమర్శలు చేశారు. ఇక, ఈ పరంపరలో రాష్ట్ర సర్కారులో కీలక భాగస్వామిగా ఉన్న పవన్.. ఉచిత పథకాలు ఎవరూ కోరుకోవడం లేదని చెప్పడం విమర్శలకు దారితీసింది.

# తెలంగాణకు భారీ వర్షం సూచన..




హైదరాబాద్, తెలుగు రాష్ట్రాలకు వానగండం పొంచి ఉందా? దీపావళికి ముసురు రానుందా? వాతావరణ శాఖ అధికారులు ఏం చెబుతున్నారు? తెలంగాణలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు పడనున్నాయి. కొన్ని జిల్లాల్లో ఓ మోస్తరు వర్షం పడనుంది. రానున్న రెండుమూడు రోజులు వాతావరణం ఇలాగే ఉంటుందని వాతావరణ శాఖ తెలిపింది.

దీపావళికి ముసురు తప్పదా?

మే నెల చివర దక్షిణ భారతాన్ని నైరుతి రుతుపవనాలు తాకాయి. సెప్టెంబర్ 20 నాటికి ఉత్తర భారతదేశానికి చేరుకున్నాయి. గతనెల 24 నుంచి తిరుగుముఖం పట్టాయి. ఈ క్రమంలో తెలంగాణ, ఏపీల్లో అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశముందని వాతావరణ శాఖ చల్లటి కబురు చెప్పింది.అక్టోబరు 15 నుంచి తెలంగాణలో నైరుతి రుతుపవనాలు నిష్క్రమించే అవకాశాలు ఉన్నాయని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో సోమ, మంగళవారాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయి. తెలంగాణలో సాయంత్రం వరకు పొడి వాతావరణం ఉంటుంది.

తెలుగు రాష్ట్రాల వాన కబురు

రానున్న రెండుగంటలు యాదాద్రి భువనగిరి, నల్గొండ, సూర్యాపేట, జనగాం, మహబూబాబాద్, ములుగు, భద్రాద్రి-కొత్తగూడెంలో మోస్తరు వర్షాలు పడనున్నాయి. ఆ తర్వాత క్రమంగా తగ్గుముఖం పట్టనున్నాయి. హైదరాబాద్ సిటీలో రానున్న గంట పాటు జల్లులు, చినుకులు పడే అవకాశం ఉంది. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. రాత్రి సమయాల్లో ఉరుములతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది.అత్యవసరం తప్పితే ప్రజలు బయటకు రావొద్దని సూచించింది. వర్షం సమయంలో చెట్ల కింద, హోర్డింగుల వద్ద ఉండొద్దని పేర్కొంది. భారత వాతావరణ శాఖ-IMD అక్టోబర్ 15 నుంచి 16 మధ్య హెచ్చరిక జారీ చేసింది. దక్షిణ భారతంలో రాబోయే కొద్దిరోజుల్లో కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుండి భారీ వర్షాలు పడతాయని తెలిపింది.అక్టోబర్ 12 నుండి 18 వరకు తమిళనాడు, కేరళలోని కొన్నిప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అక్టోబర్ 13 నుంచి 14 మధ్య దక్షిణ కర్ణాటక, కోస్తాంధ్ర, యానాం ప్రాంతాలలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. ఉరుములు, మెరుపులతోపాటు ఈదురు గాలులు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్లు వేగంతో వీచే అవకాశం ఉందని తెలిపింది.

హైదరాబాద్ వాతావరణ సూచన

-అక్టోబర్ 13న ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. రోజంతా స్వల్పంగా పొగమంచు ఉంటుంది. ఉష్ణోగ్రతలు 31°C వద్ద ఉన్నట్లు అంచనా వేసింది.-అక్టోబర్ 14న హైదరాబాద్ సిటీలో ఆకాశం సాధారణంగా మేఘావృతమై తేలికపాటి వర్షం లేదా చినుకులు పడే అవకాశం ఉంది. ఉష్ణోగ్రతలు 31°Cకి దగ్గరగా ఉండటంతో తేమస్థాయి కొద్దిగా పెరుగుతుందని అంచనా.అక్టోబర్ 15న ఆకాశం మేఘావృతంగా ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయి.-అక్టోబర్ 16న ఆకాశం మేఘావృతమై తేలికపాటి వర్షం లేదా చినుకులు పడవచ్చు. ఉష్ణోగ్రతలు 30°C ఉండవచ్చని భావిస్తోంది. ఆ తర్వాత వాతావరణం తేమగా ఉంటుందని తెలిపింది. 17, 18 తేదీల్లో ఇదే పరిస్థితి నెలకొంటుందని అంచనా వేసింది. ఎటుచూసినా దీపావళికి ముందు భారీ వర్షాలు తప్పవని అంచనా వేస్తోంది వాతావరణ శాఖ.

## గంజాయి ధ్వంసంతో తండావాసులు దాడి

సంగారెడ్డి,సంగారెడ్డి జిల్లాలోని చల్లగిద్దా తండాలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గంజాయి మొక్కలను ధ్వంసం చేశారని పోలీసులపై తండా వాసులు రాళ్ల దాడికి పాల్పడ్డారు. చల్లగిద్దా తండాలో గంజాయి సాగు చేస్తున్నట్లు సంగారెడ్డి జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో పోలీసులు ఇవాళ ఉదయం తండాకు చేరుకుని విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. పత్తి చేనులో గంజాయి మొక్కలు కనిపించగా, వాటిని పోలీసులు ధ్వంసం చేశారు. ఈ క్రమంలో పోలీసులపై తండా వాసులు దాడికి దిగారు.

# ఆదాయం లేదు.. రాజకీయాల కంటే సినిమాలే బెటరా?



కేరళ:మలయాళ నటుడు, కేంద్ర సహాయమంత్రి సురేష్ గోపీ చేసిన తాజా వ్యాఖ్యలు ఇప్పుడు దేశవ్యాప్తంగా ముఖ్యంగా రాజకీయ, సినీ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. "రాజకీయాల్లో సంపాదన లేదు, ఆదాయం కోసం మళ్లీ సినిమాల్లోకి పోతాను" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. కేంద్ర మంత్రి పదవిని కూడా వదులుకోవడానికి సిద్ధపడటం.. ఈ మొత్తం వ్యవహారం వెనుక ఉన్న ఆర్థిక అంశాలను, అలాగే ప్రజా జీవితంలో ఉన్న సవాళ్లను వెలుగులోకి తెస్తోంది.

ఆదాయం తగ్గింది: మంత్రి పదవి వద్దు!

పెట్రోలియం శాఖ సహాయమంత్రిగా ఉన్న సురేష్ గోపీ, ఇటీవల కేరళలోని బీజేపీ కార్యకర్తలతో మాట్లాడుతూ తన మనసులోని మాటను బయటపెట్టారు. "రాజకీయాల్లో ఉండటం వల్ల ఆదాయం తగ్గిపోయింది. నేను ఎప్పుడూ సినిమాలను పూర్తిగా వదిలిపెట్టాలని అనుకోలేదు. మళ్లీ నటనలో కొనసాగాలని ఉంది" అని ఆయన స్పష్టంగా చెప్పారు. అంతేకాకుండా తన పదవిని కేరళకే చెందిన సీనియర్ నేత సదానందన్ మాస్టర్‌కు ఇవ్వాలని కూడా సూచించారు. ఈ వ్యాఖ్యలు సురేష్ గోపీ యొక్క వ్యక్తిగత ఆర్థిక స్థితిని మాత్రమే కాకుండా, రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత ఒక నటుడు ఎదుర్కొనే ఆర్థిక ఒత్తిడిని కూడా సూచిస్తున్నాయి. సినిమా ఇండస్ట్రీలో భారీ పారితోషికాలు పొందే ఆయనకు, రాజకీయ పదవి ద్వారా వచ్చే ఆదాయం సరిపోకపోవడం లేదా ఆయన ఆర్థిక అవసరాలను తీర్చలేకపోవడం స్పష్టంగా కనిపిస్తోంది.

రాజకీయాలు సర్వీస్ మాత్రమేనా?

సురేష్ గోపీ మాటలు ఒక పెద్ద ప్రశ్నను లేవనెత్తుతున్నాయి. "రాజకీయాల్లో సర్వీస్ మాత్రమేనా? లేక సర్వైవ్ అవ్వడం కూడా కష్టమా?" అన్నది నిర్ణయించుకోవాలి. ప్రజా సేవ చేయాలనే తపనతో రాజకీయాల్లోకి అడుగుపెట్టినా.. తమకు ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న వృత్తి అయిన సినిమాలను పూర్తిగా వదిలేయాల్సి రావడం వల్ల ఆర్థికంగా భద్రత లేమి ఏర్పడుతుందని సురేష్ గోపీ పరోక్షంగా చెప్పినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ పరిస్థితిలో రాజకీయాల కంటే సినిమాలే స్థిరమైన ఆదాయం, ఆర్థిక భద్రత కలిగిన వృత్తిగా ఆయనకు అనిపించడం సహజం.2024 లోక్‌సభ ఎన్నికల్లో త్రిశూర్ నియోజకవర్గం నుంచి గెలిచి కేంద్ర మంత్రివర్గంలో చోటు దక్కించుకున్న ఆయన, ఇప్పుడు ఆదాయం కోసమే మళ్లీ వెండితెర వైపు మొగ్గుచూపడం, ప్రజా జీవితంలోకి వచ్చేందుకు సిద్ధపడే ఇతర ప్రముఖులకు ఒక హెచ్చరికలా కనిపిస్తోంది.

సినీ వర్గాల స్పందన

సురేష్ గోపీ నిర్ణయం పట్ల సినీ వర్గాలు కూడా సానుకూలంగానే స్పందిస్తున్నాయి. నటన ఆయనకు దగ్గరైన మాధ్యమం కావడం వలన మళ్లీ సినిమాల్లోకి రావాలనుకోవడం సహజమని, ప్రజా సేవతో పాటు వ్యక్తిగత జీవితాన్ని, ఆర్థిక అంశాలను కూడా బ్యాలెన్స్ చేసుకోవాల్సిన అవసరం ఉంటుందని వారు భావిస్తున్నారు.మొత్తంగా సురేష్ గోపీ వ్యాఖ్యలు కేవలం వ్యక్తిగత ఇబ్బందులను మాత్రమే కాదు, రాజకీయాల్లోకి వచ్చే ప్రముఖులు ఎదుర్కొనే ఆర్థిక సవాళ్లను కూడా ఎత్తిచూపుతున్నాయి. ప్రజా సేవతో పాటు వ్యక్తిగత జీవితాన్ని, ఆర్థిక అవసరాలను ఎలా సమన్వయం చేసుకోవాలో అనేది ఈ సంఘటన ద్వారా మరోసారి చర్చనీయాంశమైంది.

## పాక్‌కు కొత్తగా ఆయుధ సరఫరా ఏదీ లేదు

న్యూఢిల్లీ, పాక్‌కు కొత్తగా ఎలాంటి ఆయుధాలను సరఫరా చేయడం లేదని అమెరికా తెలిపింది. గతంలో చేసుకున్న ఒప్పందాల్లో మిగిలినవి ఏవైనా ఉంటే సరపరా చేస్తున్నామని పేర్కొంది. గగనతలం నుంచి గగనతలంలోని లక్ష్యాలను ఛేదించే అధునాతన ఏఐఎం-120 క్షిపణుల విషయంలో పాకిస్థాన్‌కు ఆయుధశక్తిని కొత్త పెంచింది లేదని అమెరికా స్పష్టం చేసింది.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com